క్లుప్తంగా

నియామకపత్రం అందజేత

పాలమూరు: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ రషీద్ అహ్మద్‌ను నియమిస్తూ సోమవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫారూఖ్ పాల్గొన్నారు.

దేవరకద్ర: మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాచాల సోమవారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో బీజేపీ కండువా వేసుకున్నారు.

ముస్తాబైన శివాలయం



రాజాపూర్: మండలంలోని చొక్కంపేట్‌లో నిర్మించిన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రారంభానికి ముస్తాబైంది. సోమవారం ఆలయ ప్రారంభోత్సవానికి ముందుగా హోమగుండాలను, మంటపాలను నిర్మించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే పైచేయి

హన్వాడ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించనున్నారని నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో సమావేశమై మాట్లాడారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి ఎంపీ పరామర్శ

నవాబుపేట: మండలంలోని రుద్రారం చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాంరెడ్డి భార్య ఎనుగొండ అరుణమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, నర్సింహులు, గోపాల్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణగౌడ్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ఐజేయూ నాయకుల హర్షం




జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఐజేయూ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డిని ప్రెస్ అకాడమి చైర్మన్‌గా ప్రభుత్వంపై నియమించడంపై జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఐజేయూ జిల్లా అధ్యక్షుడు దతేందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తికి ఈ అవకాశం రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, శేఖర్‌గౌడ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను సోమవారం ఎంపీటీసీ రోజా ప్రారంభించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వై.మహేందర్‌గౌడ్, విద్యాసాగర్, రవీందర్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంకు



బాలానగర్: మండలంలోని ఉడిత్యాలలో ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు పక్కనే ప్రాథమిక పాఠశాల ఉన్నందున ఏ క్షణానైనా కూలే ప్రమాదం లేకపోలేదని విద్యార్థుల తల్లితండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామానికి వచ్చిన కలెక్టర్, పాలకులకు కోరినా మరమ్మతులు, కూల్చివేత ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క(ట)ంకరకు గ్రహణం వీడేనా?

- నిధుల లేమితో మూడేళ్లుగా సాగని పనులు
- నిలిచిన హన్వాడ – టంకర మీదుగా గుడిమల్కాపూర్ బీటీ పనులు



గుడ్డిమల్కాపూర్-టంకర రోడ్డుపై కిందపడ్డ ప్రయాణికులు (ఫైల్)

హన్వాడ: గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన పీఎం గ్రామీణ సడక్ యోజన పథకం కింద హన్వాడ నుంచి టంకర మీదుగా గుడిమల్కాపూర్ వరకు బీటీ రోడ్డు మంజూరైంది. 6.12కి.మీ.ల దూరం వ్యవధిలో ఉన్న ఈ రోడ్డుకు ప్రభుత్వం రూ.397.30లక్షలు మంజూరు చేసింది. 2021, జులై 20న ప్రారంభమైన పనులను 2023 జనవరి 19నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అటు నుంచి 5ఏళ్ల వ్యవధిలో రోడ్డు నిర్వహణ సమయం నడుస్తున్నా రోడ్డు మాత్రం పూర్తి కాలేదని స్థానిక గ్రామాల ప్రజలు విమర్శలు చేస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహణలో చేపట్టిన పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో (కేంద్రం 60శాతం, రాష్ట్రవాటా 40శాతం) నిధులు వెచ్చించి పనులు పూర్తి చేయాలి. కానీ గత ప్రభుత్వం నిధుల లేమితో వాటా నిధులు సమకూర్చకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. దీంతో మూడేళ్ల నుంచి పనులు నిలిచిపోవడంతో గుడ్డిమల్కాపూర్, టంకర ప్రజలు హన్వాడకు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గుడ్డిమల్కాపూర్– టంకర మధ్య ప్రమాదాలు

ప్రధానంగా గుడ్డిమల్కాపూర్ నుంచి జిల్లా, మండల కేంద్రాలకు రావాలంటే టంకర మీదుగానే రావాల్సి ఉంది. అదే విధంగా పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు పలుమార్లు రోడ్డు ప్రమాదాల బారిన పడి గాయాలపాలయ్యారు. నిత్యం జిల్లా కేంద్రానికి ప్రయాణికులతో రాకపోకలు సాగించే ఆటోలు సైతం ప్రమాదాలకు గురైన సందర్భాలున్నాయి. ఈ రోడ్డుకు నిధులు వెచ్చించడంలో తాత్సారం చేసిన గత ప్రభుత్వం కారణంగా రోడ్డు పనులు నిలిపోగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా బీటి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వర్షానికి దెబ్బతిన్న రోడ్డు

మా బాబు కాలు విరిగింది



రోడ్డుపై కంకర కారణంగా బైక్‌పై వెళ్లే వారు నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుంది. అయినప్పటికీ ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో బైక్ జారి నా కుమారుడు ప్రమాదానికి గురయ్యాడు. ఇలా నిత్యం రోడ్డు కారణంగా నరకం అనుభవిస్తున్నాం. అధికారులు తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయాలి.

– రాజు, గుడ్డిమల్కాపూర్

నిధుల సమాచారం లేదు

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇదే గ్రాంట్ కింద ఇతర మండలాల్లోనూ రోడ్డు పనులు చేశారు. ఈ పనులకు సంబంధించి నిధులు పెండింగ్ పడడంతో చేసిన పనులకు నిధులు విడుదల చేస్తేనే మిగతా పనులు చేస్తామంటున్నారు. ఇక ప్రభుత్వం నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందో సమాచారం లేదు. ఈ విషయంలో నేనేమీ చెప్పలేను.

– సురేష్ పీఆర్ ఏఈ, హన్వాడ

రూ. 20కోట్లకు పైగా బకాయిలు

ఇదే గ్రాంట్ కింద ఇతర మండలాల్లోనూ పనులు చేశాను. వాటికి సంబంధించి సుమారు రూ.20కోట్ల వరకు నిధులు రావాల్సి ఉంది. ఇప్పటికే చాలా నిధులు వెచ్చించాను. మిగతా పనులు చేయాలంటే చేసిన పనులకు డబ్బులు ఇవ్వాలి. ఏమీ ఇవ్వకుంటే నేను ఎక్కడి నుంచి తీసుకురాను. ఇప్పటికే అప్పుల పాలైయ్యాను. ప్రభుత్వం నిధులు ఇచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేస్తాం.

– శివానందస్వామి, కాంట్రాక్టర్

ఆర్‌ఓబీతో ప్రజలకు మేలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా సోమవారం అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద స్టేషన్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలతోపాటు ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక అప్పన్నపల్లి ఆర్‌యూబీ 54 వద్ద ప్రారంభోత్సవంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. ఈ బ్రిడ్జి వల్ల వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇంతకుముందు ఒకే మార్గంలో ఉండడం వల్ల వాహనదారులు కాస్త ఇబ్బందిపడేవారని, ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్ రామాంజనేయులు, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, హనీఫ్ అహ్మద్, సాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

డోకూర్ అండర్ పాస్‌కు శంకుస్థాపన.

దేవరకద్ర: మండలంలోని డోకూర్ వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ పాస్‌కు సోమవారం ఎంపీటీసీ యజ్ఞభూపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌ల పథకం కింద డోకూర్ అండర్‌పాస్‌కు శంకుస్థాపన చేశారు. అండర్‌పాస్ వద్ద ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేటు వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ప్రధాని ప్రసంగాన్ని ప్రజలు, విద్యార్థులు, అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు సతీష్, జాని, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి రాజేందర్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

అడ్డాకుల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయనుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. భూత్పూర్ మండలంలోని వెల్కిచర్ల, భట్టుపల్లి, కొత్త మొల్గర, పోతులమడుగు, అన్నాసాగర్‌లో సోమవారం ఆయన పర్యటించి సీసీరోడ్ల పనులను ప్రారంభించారు. సకాలంలో పనులను పూర్తి చేయాలని చెప్పారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అన్నాసాగర్‌లో సీనియర్ నాయకుడు శంషుద్దీన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. గత ప్రభుత్వంలో తమకు సంక్షేమ పథకాలు అందలేదని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, నర్సింహారెడ్డి, నవీన్‌గౌడ్, వెంకటేష్, పవన్‌కుమార్, జమీర్, నాగిరెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.



అన్నాసాగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సంతోషిమాత దేవాలయ ద్వాదశ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవాచన, భక్తులచే అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. విశేష అలంకరణ సంతోషిమాత హవణం, సుహాసిని సహిత సామూహిక కుంకుమార్చనలు, పల్లకీసేవ, మహర్నివేదన, మంగళహారతి నివేదించి ఆశీర్వచనాలు ఇచ్చారు.

వరికి పొటాష్ తప్పకుండా వాడుకోవాలి

రాజాపూర్: వరి పంటకాలంలో మొక్కలలో జరిగే అనేక జీవక్రియల్లో పొటాష్ చురుకైన పాత్ర పోషిస్తుందని దానికోసం ఈ యాసంగిలో రైతులు పొటాష్ తప్పకుండా వేసుకోవాలని ఏడీఏ ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తిర్మలాపూర్, కుచ్చర్‌కల్‌లో రైతులు సాగు చేసిన వరి పైర్లను పరిశీలించారు. ఈ యాసంగిలో జింక్ లోపం వల్ల పంటల దిగుబడి తగ్గుతుందని తెలిపారు. జింక్ ధాతులోపం గమనించినట్లయితే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 5 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగుళ్లను నిరోధించే శక్తిని మొక్కలకు పొటాష్ కలిగిస్తుందన్నారు. వెన్నులలో తాలుగింజలు లేక అన్ని ఎందుగా బరువుగా నాణ్యంగా ఉండటానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన రైతులకు సూచించారు. ఏఓ నరేందర్, రైతులు ఉన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ ఆంజనేయులు

'పేట' మున్సిపాలిటీలో ముసలం

- చర్చనీయాంశంగా మారిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల తీరు
- రాజీనామాకు సిద్ధమైన వైస్‌చైర్మన్

నారాయణపేట: జిల్లా కేంద్రమైన నారాయణపేట మున్సిపాలిటీలో ముసలం పుట్టింది. బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన చైర్‌పర్సన్ గందె అనసూయపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు తిరుగుబావుటకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సోమవారం జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఇలా వచ్చి.. అలా బయటికి పోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

ప్యాకేజీ, పనులు ఇవ్వకపోవడంతోనే.?

చైర్‌పర్సన్‌కు సపోర్టు చేసిన కౌన్సిలర్లకు గిఫ్ట్‌గా ఎన్నికల ఖర్చులో కొంత ఇస్తానని మాటిచ్చి తప్పారంటూ గందె అనసూయ భర్తపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్యాకేజీ ఇవ్వలేని పక్షంలో తాము సూచించిన అభివృద్ధి పనులైనా ఇవ్వాలని చైర్‌పర్సన్‌ను అడిగితే తన భర్తకు తెలుసు అని సమాధానం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో చైర్‌పర్సన్‌కు తామెందుకు సపోర్టు చేయాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు భావిస్తున్నారు.

బడ్జెట్ లేకపోవడంపై ఆవేదన..

కౌన్సిలర్లుగా పదవి చేపట్టి నాలుగేళ్లు అవుతుందని.. వార్డుల్లో పనులు చేపట్టేందుకు బడ్జెట్ లేనప్పుడు మున్సిపల్ సమావేశాలు ఎందుకని పాలకవర్గ సభ్యులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సోమవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం కంటే ముందుగా ఓ బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త ఇంట్లో చైర్‌పర్సన్, ఆమె భర్తతో పాటు ఆ పార్టీ కౌన్సిలర్లు సమావేశమైనట్లు తెలుస్తోంది. కౌన్సిల్ సమావేశంలో పెట్టే ప్రియాంబుల్స్‌పై ఒక్కసారైనా తమతో చర్చించారా.. లేక ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా అని ఏనాడైనా అడిగారా అంటూ వారి ముందు నిర్మోహమాటంగా చెప్పినట్లు తెలిసింది. ఇప్పుడైతే బడ్జెట్ సమావేశానికి వెళ్దామని.. ఆ తర్వాత కూర్చొని మాట్లాడుదామని చెప్పడంతో ఐదుగురు కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ సకాలంలో సమావేశానికి చేరుకున్నారు.

వైస్‌చైర్మన్‌కు బుజ్జగింపులు..

రాజీనామాకు సిద్ధమైన మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్‌ను బుజ్జగించేందుకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు భేటీ అయినట్లు సమాచారం. ఈ భేటీలో 'వైస్ చైర్మన్‌గా తనకు విలువ ఇవ్వనప్పుడు పదవి ఎందుకని.. మీరు ముందుగా చైర్‌పర్సన్‌ను తప్పించండి.. మీ వెంట నేనుంటా.. నేను సైతం నా పదవికి రాజీనామా చేస్తా.. మీలో ఎవరినైనా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోండి.. సపోర్ట్ చేసిన వారికి వైస్‌చైర్మన్ పదవి కట్టబెట్టండి' అంటూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు వైస్ చైర్మన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

మాజీ ఎమ్మెల్యే వద్దకు..

పంచాయితీ నేడో, రేపో మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లాలని యోచిస్తున్నట్లు పలువురు కౌన్సిలర్లు తెలిపారు. ప్రస్తుత చైర్‌పర్సన్‌ను కొనసాగించేలా సమాలోచనలు చేస్తారా.. లేక ఆమెను తప్పించి, మరొకరికి అవకాశం ఇచ్చి, పార్టీలో విబేధాలు లేకుండా చూస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది.

వేరుశనగ ధర రూ.4,519

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం నిర్వహించిన టెండర్లలో వేరుశనగ ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.4,519 గా ఒకే ధర నమోదైంది. సీజన్ తగ్గడం వల్ల మార్కెట్‌లో లావాదేవీలు తక్కువ మొత్తంలో కొనసాగాయి.

కుక్కల దాడిలో గాయపడిన జింకపిల్ల



అడ్డాకుల: మండలంలోని చిన్నమునుగల్‌ఛేడ్ సమీపంలో కుక్కల దాడిలో గాయపడిన జింకపిల్లను సోమవారం పోలీసులు అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గ్రామానికి సమీపంలో వచ్చిన జింక పిల్లను కుక్కలు వెంటాడాయి. దాడిలో గాయపడిన జింక పిల్లను స్థానికులు చూసి కుక్కలను తరిమారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జింక పిల్లను తీసుకొచ్చి పశు వైద్యుడితో ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత దాన్ని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ నిరంజన్‌కు అందజేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఇదిలా ఉండగా గాయపడిన జింక పిల్లను జిల్లా కేంద్రానికి తీసుకెళ్లారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్యం ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం టీఎన్‌జీఓ భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ.. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. తమ హక్కులను సాధించేదాక పోరాటం చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నగేష్‌ను నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజు, శివకుమార్, శ్రీనివాస్, నాగన్న, మనోహర్, రఘు, బాగన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

చిన్నచింతకుంట: బైక్ అదుపుతప్పి కింద పడి ఓ యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని లాల్‌కోట సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉంద్యాలతండాకు చెందిన మన్నెంనాయక్ దేవరకద్ర పట్టణం నుంచి ఉంద్యాల గ్రామానికి బైక్‌పై వస్తుండగా లాల్‌కోట సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడి పోయాడు. అంజినాయక్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం మహబుబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ నర్సింహారాజు, నంబిరాజు సురేందర్, భక్తరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ నాయకుల చేరితో పార్టీకి బలం



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ నాయకుల చేరికతో కాంగ్రెస్ పార్టీకి బలం చేకూరుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌టీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు హైదర్‌అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ వాజిద్, మండల అధ్యక్షుడు జహంగీర్ తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వైఎస్సార్‌టీపీ సహకరించిందని, ఈ మధ్యనే ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినట్లు గుర్తుచేశారు. వైఎస్సార్‌టీపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందని, అందరితో కలిసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం



ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేస్తున్న అధ్యక్షుడు శ్యామ్‌బాబు

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని పీఆర్‌టీయూ తెలంగాణ అధ్యక్షుడు శ్యాంబాబు తెలిపారు. సోమవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతిసింగ్, ఆనంద్‌రెడ్డి, నాగిరెడ్డి, నాగునాథ్, శివానంద్, నజీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయానికి ఘనమైన చరిత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రవీంద్రనగర్‌లోగల పోచమ్మ దేవాలయం (శీతలాదేవి)కు ఘనమైన చరిత్ర ఉందని, కాకతీయుల రాజుల కాలంలో స్థాపించినట్లు అధ్యక్షుడు కనికె శ్రావణ్‌కుమార్, గౌరవ సలహాదారు కొత్త సత్యం, ఉపాధ్యక్షుడు వేదవ్రత్, కోశాధికారి బుట్ట ఆనంద్‌కుమార్, అర్చకుడు రామకృష్ణశర్మ వెల్లడించారు. దేవాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోచమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయంలో ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. దేవాలయంలో మంగళవారం నుంచి ఈనెల 29 వరకు శిఖర కలశ, నాగదేవతల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సవత్స గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, పంచగవ్యప్రాశన, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ప్రధాన కలశస్థాపన, సాయంత్రం మంగళహారతి పూజలు ఉంటాయని తెలిపారు. పట్టణంలోని పలు అమ్మవారి దేవాలయాలకు పట్టువస్త్రాలు సమర్పిస్తామని తెలిపారు. 28న వేదపారాయణం, జలాధివాస ఉత్థాపన, పోచమ్మదేవికి చండీహోమం, శిఖర కలశాలు, నాగుల ఊరేగింపు, 29న అవాహిత దేవతా హోమాలు, శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాంతానంద పురోహిత్ చేతులమీదుగా శిఖర కలశస్థాపన, నాగదేవతా ప్రతిష్ఠ మహోత్సవం ఉంటాయని తెలిపారు. మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. అనంతరం మహోత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలస్వామి, మహేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

నామినేటెడ్ పదవులపై ఆశ !

- నవాబుపేటలో రెండు పోస్టులు
- కొత్త నేతల ఆసక్తి

నవాబుపేట: కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో నామినేటెడ్ పదవులకు ఆశవాహులు ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండగా అప్పట్లో వంతుల వారిగా పదవులు దక్కించుకున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ కొలువుతీరిన తరుణంలో కొత్త నాయకులు ఎదురుచూస్తున్నారు. మండలంలో రెండు నామినేటెడ్ పదవులు ఉన్నాయి. వాటిలో ఒకటి పర్వతాపూర్ మైసమ్మ దేవాలయం, మరోకటి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవులు ఖాళీ అయ్యాయి.

మార్కెట్ చైర్మన్ బీసీ జనరల్

మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు పదేళ్ల క్రితం కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఐదుగురు చైర్మన్‌లు కొనసాగగా, వాటిలో కేవలం ఒకే వ్యక్తి కాంగ్రెస్ హయంలో చైర్మన్‌గా ఉండగా, మిగతా వారు బీఆర్‌ఎస్ పాలనలో కొనసాగారు. తాజాగా కాంగ్రెస్‌కు అవకాశం వచ్చింది. ప్రస్తుతం మార్కెట్ చైర్మన్ బీసీ జనరల్‌కు కేటాయించారు. ఈ పదవి విషయంలో చాలా పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా మండల కేంద్రానికి చెందిన బంక వెంకటయ్య, పుట్టి ఆంజనేయులు, మల్లేష్ యాదవ్, అజహర్‌అలీ పేర్లు వినిపిస్తున్నాయి. మార్కెట్ చైర్మన్ మండల కేంద్రం కాకుండా ఇతర గ్రామాల వారికి కేటాయించాల్సి వస్తే దేపల్లి వెంకటేష్‌గౌడ్, అమ్మపూర్ అంతయ్య, కొల్లూర్‌కు చెందిన వాసుయాదవ్‌ల పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కాగా వీరిలో ఎమ్మెల్యే అండదండలు ఎవరికి ఉంటాయో వారే చైర్మన్‌గా ఎన్నిక కానున్నారు.



నవాబుపేట మార్కెట్ యార్డు

మైసమ్మ దేవాలయం..

మైసమ్మ దేవాలయంలో ప్రత్యేకంగా 13 మంది డైరెక్టర్లతో పాటు చైర్మన్ ఉంటారు. దేవాలయం గ్రేడ్ ఇటీవలే పెరగడంతో డైరెక్టర్ల సంఖ్య ఆరు నుంచి 13కు పెరిగింది. గతంలో 1990లో కాకర్ల పహాడ్ చెందిన మొట్టమెదటి చైర్మన్‌గా రాజేందర్‌రెడ్డి ఎంపిక య్యారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఏడుగురు చైర్మన్‌లుగా కొనసాగారు.